సాక్షి నిజామాబాద్

సోమవారం ǀ 21 ǀ అక్టోబర్ ǀ 2024



ఉన్నత లక్ష్యాన్ని..

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ లింబాద్రి అన్నారు.

- 8లో ▸



అటవీ భూమి హాంఫట్

సిరికొండ మండలంలోని పలు గ్రామాల్లో కొందరు చెట్లను నరికివేసి అటవీ భూములను ఆక్రమిస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.5 /22.1

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు తెయూ వీసీ బాధ్యతల స్వీకరణ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ వీసీగా సోమవారం టి యాదగిరి రావు బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్న యాదగిరిరావు శుక్రవారం తెయూ వీసీగా నియామకమయ్యారు. ఆయన శనివారం కేయూలో రిలీవ్ అయ్యారు. సోమవారం తెయూ పరిపాలనా భవనంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇందుకోసం తెయూ రిజిస్ట్రార్ యాదగిరి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి



నిజామాబాద్‌అర్బన్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11.30 గంటలకు నుడా చైర్మన్ కేశ వేణు ప్రమాణ స్వీకారంలో మంత్రి పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, సాయంత్రం 4 గంటలకు బస్వాగార్డెన్‌లో జరిగే కార్యక్రమానికి హాజరు కానున్నారు.

నేడు నుడా చైర్మన్‌గా కేశ వేణు ప్రమాణస్వీకారం



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) చైర్మన్‌గా కేశ వేణు సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి నుడా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ హాజరు కానున్నారు.

జిల్లా సరిహద్దులో చెక్ పోస్టులు

ఖలీల్‌వాడి: మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఆదివారం తెలిపారు. పోతంగల్, యంచ, కందకుర్తి, సాలురా ప్రాంతంలో ఎక్సైజ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, సిబ్బందితో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. శనివారం రాత్రి మహారాష్ట్ర నుంచి జిల్లాకు దేశీదారును తరలిస్తున్న వాహనాన్ని కందకుర్తి వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నట్లు తెలిపారు. రెంజల్ మండలం నీలా గ్రామానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

కొనసాగుతున్న గాలికుంటు టీకాలు



డొంకేశ్వర్(ఆర్మూర్): పశువుల్లో గాలికుంటు వ్యాధిని నివారించేందుకు పశుసంవర్ధక శాఖ చేపట్టిన టీకాల కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. ఈ నెల 14న ప్రారంభమైన స్పెషల్ డ్రైవ్ నవంబర్ 15వరకు జరగనుంది. అన్ని మండలాలకు వ్యాక్సిన్లు చేరవేయగా పశువైద్యధికారులు ప్రతీరోజు ఉదయం 10గంటల్లోపు టీకాలు వేస్తున్నారు. ఇప్పటి వరకు ఆవులు, గేదెలు, దూడలు, లేగలు కలిపి 18వేల పశువులకు టీకాలు పూర్తి చేసినట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి తెలిపారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

దోమకొండ: మండల కేంద్రంలోని ఆనంద్ భవన్‌లో ఆదివారం అండర్ -17 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. దోమకొండ ట్రస్ట్‌తోపాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంయుక్తంగా క్యాంప్ నిర్వహించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి 78 మంది క్రీడాకారులు (బాలురు, బాలికలు) పాల్గొన్నారు. నిజామాబాద్‌తోపాటు కామారెడ్డి జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రెటరీ హీరాలాల్, మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమల్‌గౌడ్, శంకర్‌రెడ్డి, సీతారాం మధు పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో మంత్రి తుమ్మల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రోడ్డెక్కిన గులాబీ శ్రేణులు

- రైతు భరోసా కోసం బీఆర్‌ఎస్ నాయకుల నిరసన
- వానాకాలం సీజన్ నుంచే అమలు చేయాలని డిమాండ్
- రెండురోజుల పాటు ఆందోళనలు చేసిన పార్టీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రైతు భరోసా అందించాలని గులాబీ శ్రేణులు రోడ్డెక్కాయి. అన్నదాతలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్‌ఎస్ నాయకులు జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం ముగిసిన వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుభరోసా అందించకపోవడం సరికాదంటూ బీఆర్‌ఎస్ నాయకులు శనివారం, ఆదివారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం మరింత ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మాజీ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడారు. మాక్లూర్ మండలం మాణిక్‌భండార్ వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. రుద్రూర్ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శనివారం ఆందోళనలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆర్మూర్, నందిపేట మండలాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు శనివారమే ఆందోళనలు చేపట్టాయి. రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశాయి.

రైతులు పోరాటం చేయాలి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్: రైతులు పోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందన్నారు. వానాకాలం సీజన్‌కు రైతుభరోసా ఇవ్వకపోవడం సరికాదన్నారు. రూ.80 వేల కోట్ల అప్పు తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.7 వేల కోట్ల పెట్టుబడి సహాయం అందించలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి మూసీ సుందరీకరణ తప్ప రాష్ట్ర అభివృద్ధి కనిపించడం లేదన్నారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. కమీషన్లు రావనే రైతుబంధును నిలిపివేశారని ఆరోపించారు. రైతులను కేసీఆర్ రాజును చేయాలని చూస్తే సీఎం రేవంత్ రెడ్డి దివాల తీయించాడన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

రైతన్నను వెంటాడుతున్న వాన

- తడిస్తున్న ధాన్యం
- కొనుగోలు కేంద్రాల్లో ప్రారంభం కాని ధాన్యం తూకాలు
- దళారులకు విక్రయిస్తున్న అన్నదాతలు

సుభాష్‌నగర్/రెంజల్: వరి రైతులను వాన వెంటాడుతోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చాక వర్షాలు పడుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కోసి ఆరబోసిన వడ్లను కాపాడుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా 4.30 లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. పలు మండలాల్లో కోతలు ఊపందుకున్నాయి. అయి తే ఎక్కడా కూడా ధాన్యం తూకాలు ప్రారంభం కాకపోవడంతో రాశులు పేరుకుపోతున్నాయి. జిల్లాలో 629 కొనుగోలు కేంద్రాల ద్వారా 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 70కిపైగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. అయితే ఎక్కడా కూడా తూకాలు వేయడం లేదు. దీంతో ధాన్యం తడిసిపోతోంది.

ధర తగ్గిస్తున్న వ్యాపారులు

వర్షాలు పడుతుండటంతో వ్యాపారులు ధాన్యం ధరలు తగ్గించారు. రైతుల అవసరాలను బలహీనతలుగా చేసుకుని ఇష్టం వచ్చిన ధరకు ఇస్తేనే బార్దాని, హమాలీలను పంపుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో చేసేది లేక రైతులు వ్యాపారులు నిర్ణయించిన ధరకు అమ్ముకుంటున్నారు. మొదట్లో క్వింటాల్ సన్నరకం ధాన్యానికి రూ.2350 వరకు చెల్లించిన వ్యాపారులు వాతావరణ పరిస్థితులను సాకుగా పేర్కొంటూ ప్రస్తుతం రూ.2000 వరకు చెల్లిస్తున్నారు. వర్షం పడితే ధాన్యం తడిసిపోతుందని భయంతో అన్నదాతలు వ్యాపారులు చెప్పిన రేటుకే అమ్ముకుంటున్నారు.

మిల్లర్ల మెలిక

ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో జిల్లాలో 80 శాతం రైతులు సన్నాలను సాగుచేశారు. అయితే సన్నరకాల ఔటర్న్ 58 కిలోలకు మించి రాదని, 67 కిలోలు సీఎంఆర్ ఇచ్చుకోలేమని రైస్ మిల్లర్లు అంటున్నారు. అదేవిధంగా బ్యాంకు గ్యారెంటీ 25శాతం ఇవ్వాలంటే.. మిల్లింగ్ ఛార్జీలు రూ.10 నుంచి రూ.150కి పెంచాలని కోరారు. లేకపోతే ధాన్యం దించుకోమని వారు మెలిక పెట్టారు. వారు దించుకోకపోతే మార్కెట్ కమిటీ, ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయ్, ఇతర ప్రయివేటు గోదాముల్లో నిల్వ చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

బోనస్‌పై అయోమయం

ధాన్యానికి రూ.500 బోనస్ ఎలా ఇస్తారనే విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. కానీ ఈ సీజన్ నుంచే బోనస్ ఇస్తామని మాత్రం ప్రకటించింది. కోతలు ప్రారంభమైనా ఇంత వరకూ ఎలాంటి మార్గదర్శకాలు వెల్లడించలేదు. దీంతో బోనస్‌పై రైతులు ఆశలు వదులుకొని ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. కర్నాటక, నల్గొండ, సూర్యాపేటతోపాటు జిల్లాలోని రైస్‌మిల్లర్లు దొడ్డు, సన్నరకాలను కొంటున్నారు. తేమ శాతంతో పనిలేకుండా వ్యాపారులు కొంటుండటంతో అన్నదాతలు విక్రయిస్తున్నారు. దీనికి తోడు దళారులు చిన్న రైతులను పట్టించుకోవడం లేదు. లారీకి అవసరమైన 200 బస్తాల ధాన్యం లభించే రైతులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో తక్కువ వడ్లు ఉన్న రైతులు కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోళ్లు ప్రారంభించాలని కోరుతున్నారు.



కోటగిరిలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

కేసీఆర్ ఒక్కడే దీక్ష చేస్తే రాష్ట్రం రాలేదు




అభినందన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

- ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం

నిజామాబాద్ అర్బన్: కేసీఆర్ ఒక్కడే దీక్ష చేస్తే తెలంగాణ రాష్ట్రం రాలేదని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఎంతో మంది ఉద్యమంలో పాల్గొన్నారని, కొందరు ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఆదివారం నగరంలోని టీఎన్జీవోస్ భవనంలో కోదండరాం అభినందనం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఉద్యమకారులను అణిచివేశారన్నారు. కేసీఆర్ పదేళ్లుగా తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని, తన ఒక్కడితోనే రాష్ట్రం ఏర్పడిందని పేర్కొనడం సిగ్గుచేటుగా ఉందన్నారు. కోట్లాది మంది ఉద్యమించడం, బలిదానాలు చేయడంతో తెలంగాణ వచ్చిందన్నారు. కేసీఆర్ రాజకీయ స్వలాభం కోసం ఉద్యమ చరిత్రను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్న సమయంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాల నిర్మాణాల కోసం విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేసిందన్నారు. నిజామాబాద్‌లో ఇరిగేషన్‌కు చెందిన విలువైన భూమిని కబ్జా చేసి తెలంగాణ భవన్ నిర్మించారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ గోపాల్‌శర్మ, టీఎన్జీవోస్ రాష్ట్ర నాయకుడు గైని గంగారాం, భాస్కర్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ 12 గేట్ల ఎత్తివేత

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి వరదనీరు పెరిగింది. దీంతో అధికారులు ఆదివారం మధ్యాహ్నం 12 గేట్లను ఎత్తి గోదావరిలోకి 37,488 క్యూసెక్కుల నీటి విడుదలను ప్రారంభించారు. జలాశయంలోకి ప్రస్తుతం 47 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5,800 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 5 వేలు, లక్ష్మి కాలువ ద్వారా 150, సరస్వతి కాలువ ద్వారా 500, ఎస్కేప్ గేట్ల ద్వారా 2200 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ఆవిరి రూపంలో 571 క్యూసెక్కులు పోతున్నాయి. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో నిండుకుండలా ఉంది.



నిజాంసాగర్ నుంచి..

'సాగర్' గేటు..

నిజాంసాగర్(జుక్కల్): ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం సాయంత్రం నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 4 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఒక గేటు ఎత్తి దిగువ మంజీరలోకి 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.



ఎస్సారెస్పీ వరద గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

జీపీఎఫ్.. జాప్యం

- అక్కరకు రాని అవసరాల నిధి
- దరఖాస్తు చేసుకొని ఏడాదైనా రాని రుణాలు
- పెండింగ్‌లో రూ.45.33 కోట్లు

డిచ్‌పల్లి మండలానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు గతేడాది సెప్టెంబర్‌లో జీపీఎఫ్ నుంచి రూ.3 లక్షల పాక్షిక ఉపసంహరణ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఏడాది గడిచినా ఇంత వరకు సొమ్ము మంజూరు కాలేదు.

సిరికొండ మండలానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు తన కూతురు వివాహం కోసం రూ.7 లక్షల పార్ట్ ఫైనల్ కోసం గత అక్టోబర్‌లో దరఖాస్తు చేశాడు. కూతురుకు పెళ్లి అయి మనవరాలు పుట్టినా ఇంత వరకు ఆ సొమ్ము చేతికి అందలేదు.

డిచ్‌పల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీపీఎఫ్ నిధి అక్కరకు రావడం లేదు. జిల్లాలో గృహ నిర్మాణం, ఆరోగ్య సంబంధ, వివాహ, శుభకార్యాలు, పిల్లల చదువుల కోసం గత నెల వరకు 1,022 మంది ఉపాధ్యాయులు జీపీఎఫ్ రుణాలు, పార్ట్ ఫైనల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పలువురికి ఏడాది గడిచినా సొమ్ము చేతికి రాని పరిస్థితి నెలకొంది. ఉద్యోగ, ఉపాధ్యాయుల మూలవేతనంలో 6 శాతం జీపీఎఫ్ కింద జమ చేస్తారు. ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం అడ్వాన్స్‌లోన్ కింద జమ అయిన మూలనిధి నుంచి 70-80 శాతం వరకు తీసుకోవచ్చు. అలాగే 15 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆరోగ్య సంబంధ విషయాల్లో, 20 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన వారు గృహ నిర్మాణ, వివాహ, శుభకార్యాలు, పిల్లల చదువు కోసం పాక్షిక ఉపసంహరణలు (పార్ట్ ఫైనల్) చేసుకోవచ్చు. నిజామాబాద్ జిల్లా పరిషత్ పరిధిలో ఉపాధ్యాయులకు సంబంధించి 2,941 జీపీఎఫ్ ఖాతాలున్నాయి. ప్రస్తుతం వీరికి సంబంధించి రూ.94.42 కోట్లు జమచేసిన మూలనిధి ఉండగా, గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 1,022 మంది ఉపాధ్యాయులు రుణాలు, పార్ట్‌ఫైనల్ కోసం దరఖాస్తు చేశారు. వారికి సంబంధించిన రూ.46.33 కోట్లు ఇంతవరకు జమకాలేదు.




జిల్లాలో జీపీఎఫ్ వివరాలు..

ఉపాధ్యాయ జీపీఎఫ్ ఖాతాలు	2,941
ప్రస్తుతం ఉన్న మూలనిధి	రూ.94.42 కోట్లు
ఆగస్ట్ 2023 నుంచి ఇప్పటి వరకు దరఖాస్తులు : 1,022	
పెండింగ్‌లో ఉన్న సొమ్ము మొత్తం రూ.45.33 కోట్లు	

జమ కాని వడ్డీ

ప్రస్తుతం జిల్లా పరిషత్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అన్ని జీపీఎఫ్ వివరాలు, మిస్సింగ్, క్రెడిట్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రతి సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించి వడ్డీ రేట్లు ప్రకటిస్తాయి. అయితే 21 ఏళ్లుగా జీపీఎఫ్‌కు సంబంధించిన వడ్డీని ఉపాధ్యాయ జీపీఎఫ్ ఖాతాల్లో జమచేయడం లేదు. జిల్లాకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు దాదాపుగా రూ.309.70 కోట్లు వడ్డీ జమకావాల్సి ఉంది. వడ్డీ జమకాక పోవడంతో పాక్షిక ఉపసంహరణలు చేసుకుంటున్న ఉద్యోగులు నష్టపోతున్నారు.

త్వరగా మంజూరు చేయాలి



జిల్లాలో చాలా మంది ఉపాధ్యాయులు జీపీఎఫ్, పార్ట్ ఫైనల్ రుణాల కోసం ఎదురు చూస్తున్నారు. అత్యవసరాల్లో ఆదుకోవాల్సిన జీపీఎఫ్ సొమ్ము సకాలంలో అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపి జీపీఎఫ్ సొమ్మును త్వరగా మంజూరు చేయాలి.

– అంకం నరేష్, పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు

పట్టభద్రుల్లో పట్టు నిలుపుకోవాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి
- మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : త్వరలో నిర్వహించే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించి పట్టు నిలుపుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపలి కృష్ణారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం కామారెడ్డిలో నిర్వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సభలో మంత్రి పాల్గొన్నారు. పట్టభద్రుల ఓట్ల నమోదును ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్‌కు మాత్రమే ఉందన్నారు. దేశంలో మూడు రాష్ట్రాలు ఏర్పాటు జరిగినపుడు తెలంగాణ ఇవ్వని బీజేపీకి, తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిన బీఆర్‌ఎస్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవడం ద్వారా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బలాన్ని పెంచుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

హామీలను అమలు చేస్తున్నాం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన రైతులకే రైతుభరోసా ఇవ్వడానికి తమ ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, అందువల్లే ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

నయాపైసా ఇవ్వలేదు..

పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ పంటలు నష్టపోయిన రైతులకు నయాపైసా ఇవ్వలేదని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు. తమ ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున ఇచ్చి ఆదుకుందన్నారు. సభలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, తెలంగాణ సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి



రుద్రూర్: చెక్‌పోస్టు నుంచి వెళ్లే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సిబ్బందిని ఆదేశించారు. పోతంగల్ మండల శివారులో మంజీరా నది సమీపంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టును సబ్ కలెక్టర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు ద్వారా ఇసుక, ధాన్యం, మద్యం, నగదు రవాణా జరిగితే వాహనాలను నిలిపివేసి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ మల్లయ్య, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అభ్యాసలో జిల్లాస్థాయి చెస్ పోటీలు



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని అభ్యాస స్కూల్‌లో అండర్–15 విభాగంలో చెస్ పోటీలు నిర్వహించారు. బాలబాలికలకు పోటీలు నిర్వహించగా గెలిచిన వారికి జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బాపూర్ రవీందర్ బహుమతులు అందజేసి అభినందించారు. విజేతలుగా నిలిచిన వారిలో అభిజిత్(అభ్యాస), సాయిరుద్ర(కాకతీయ), రిషిత(నలంద), రోషిణి(అభ్యాస) ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేశ్, జాయింట్ కార్యదర్శి గంగాధర్, లక్ష్మణ్, ఆర్బిటర్ నవ్యకృష్ణ, వైభవ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అటవీ భూమి హాంఫట్

- సిరికొండలోని పలు గ్రామాల్లో కబ్జాల పర్వం
- పట్టించుకోని అటవీ శాఖ అధికారులు



ముషీర్‌నగర్‌లో అడవికి సమీపంలో చదును చేస్తున్న భూమి



మెట్టుమర్రి తండాలో పల్లె ప్రకృతి వనం మొక్కలను తొలగించి చదును చేసిన అటవీ భూమి

సిరికొండ: ఆక్రమణదారుల భూదాహానికి అడవులు నేలమట్టమవుతున్నాయి. రూ. లక్షలు వెచ్చించి పెంచిన పచ్చని మొక్కలను కట్టివేటర్లతో దున్నేస్తున్నారు. సిరికొండ మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమార్కులు అటవీ భూములను హాంఫట్ చేస్తున్నారు. అడవులను యథేచ్ఛగా నరికేస్తూ పోడు పట్టాల పేరిట చదును చేపడుతున్నారు. ఇదంతా అటవీ అధికారుల నిర్లక్ష్యంతోనే అడవులు అంతరించిపోతున్నాయని, మామూళ్ల మత్తులో కబ్జాదారులకు అటవీ అధికారులు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముషీర్‌నగర్, కొండాపూర్, జంగిలోడి తండా పరిధిలోని మెట్టు తండా, న్యావనంది, జినిగ్యాల, పందిమడుగు, దుప్య తండా, పాకాల, తూంపల్లి, సిరికొండ అటవీ ప్రాంతాల్లో అడవుల ఆక్రమణ నిరాటంకంగా కొనసాగుతోంది. సిరికొండ అటవీ రేంజ్ పరిధిలో సిబ్బంది కొరత ఉండటంతో అడవులపై నిఘా కొరవడింది. దీన్ని అలుసుగా తీసుకొని రాత్రి వేళల్లో ప్రొక్లెయిన్లు, ఫ్రంట్ బ్లేడ్ ట్రాక్టర్లతో అడవులను చదును చేస్తున్నారు. మండలంలోని ముషీర్‌నగర్, కొండాపూర్, గడ్కోల్ బీట్లు సిరికొండ రేంజ్ పరిధిలో కాకుండా 25 కిలోమీటర్ల దూరాన ఇందల్వాయి రేంజ్ పరిధిలో ఉన్నాయి. 2016లో రేంజ్‌ల పునర్విభజన సమయంలో వాటిని సమీపంలో ఉన్న సిరికొండ రేంజ్‌లో కాకుండా ఇందల్వాయి రేంజ్‌లో కలిపారు. కొండాపూర్, ముషీర్‌నగర్ అటవీ ప్రాంతాల్లో అటవీ శాఖ సిబ్బంది పర్యవేక్షణ కొరవడటంతో అడవులను యథేచ్ఛగా నరికేస్తున్నారు. ముషీర్‌నగర్ అటవీ ప్రాంతంలో పదిహేను రోజుల వ్యవధిలో అటవీ భూమిని చదును చేసిన ఆనవాళ్లున్నాయి. మెట్టుమర్రి తండా జీపీకి చెందిన పల్లె ప్రకృతి వనంలో పెంచిన చెట్లను తొలగించి భూమిని కబ్జా చేస్తున్నారు. అటవీ భూముల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో కాంటూరు కందకాలను తవ్వించారు. కబ్జాదారులు వాటిని కూడా పూడ్చివేసి అటవీ భూమిని కబ్జా చేసి చదును చేస్తున్నారు. పోడు పట్టాల పేరిట గుట్టలపై ఉన్న ప్రాంతంలో చెట్లను నరికేసి భూములను చదును చేస్తున్నారు. అటవీ భూములను నిరాటంకంగా నరికేసి చదును చేస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం కొసమెరుపు. అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి అడవులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు చేపడతాం

ముషీర్‌నగర్, కొండాపూర్ అటవీ ప్రాంతాల్లో అడవుల నరికివేత మా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపించి తనిఖీలు చేపట్టి తగిన చర్యలు తీసుకుంటాం.
– రవిమోహన్‌భట్, అటవీశాఖ అధికారి, ఇందల్వాయి

అ‘పూర్వ’ సమ్మేళనం



తొర్లికొండలో సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు



దుబ్బలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు



ప్రగతి విద్యాలయంలో..



ఆత్మకూర్‌లో..

జక్రాన్‌పల్లి/ నిజామాబాద్‌అర్బన్/ కామారెడ్డిఅర్బన్/ నాగిరెడ్డిపేట/ మాక్లూర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆదివారం ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో పదో తరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం చేపట్టారు. జక్రాన్‌పల్లి మండలంలోని తొర్లికొండలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1985–86,కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు, జిల్లా కేంద్రంలోని దుబ్బలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2003–04 పదో తరగతి పూర్వ విద్యార్థులు, కామారెడ్డిలోని ప్రగతి విద్యాలయం హైస్కూల్‌లో 1999 నుంచి 2009 వరకు పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్ హైస్కూల్‌లో 2009–10లో పదోతరగతి చదివిన విద్యార్థులు, మాక్లూర్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000కు చెందిన పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. మిత్రులందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు.

5 తరాలు.. 120 మంది

నందిపేట్: ఉమ్మడి కుటుంబాలు కనుమరుగైన ఈ రోజుల్లో 5 తరాలకు చెందిన 120 మందికి పైగా ఒకే చోట కలిసి వేడుక చేసుకున్నారు. నందిపేట మండలంలోని శాపూర్ గ్రామానికి చెందిన కొమిరే సుధాకర్ చేంగళ్ వారి కుటుంబం బలగం పేరిట కలుసుకునేందుకు ఏర్పాటు చేశారు. పలు జిల్లాలో నివాసం ఉంటున్న 5తరాల కుటుంబాలు ఇక్కడికి చేరుకున్నారు.



ఒకరి క్షేమ సమాచారం మరొకరం తెలుసుకుంటు ఆనందంగా గడిపారు. పిల్లలు ఆటపాటలతో సందడి చేశారు.

ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ఆర్ లింబాద్రి



సమావేశంలో మాట్లాడుతున్న లింబాద్రి

నిజామాబాద్ అర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలని ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ఆర్ లింబాద్రి అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన పీడీఎస్‌యూ 50వ అర్థ శతాబ్ది ఉత్సవ సభకు ఆయన హాజరై మాట్లాడారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి మాట్లాడుతూ.. సమాజం పట్ల బాధ్యతగా ఎలా ఉండాలో పీడీఎస్‌యూ నేర్పుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పద్మారావు, మాధవరావు, శ్రీదేవి, శ్రీహరి, కోనేరు సాయికుమార్, ఆకుల పాపయ్య, భాస్కర్, సంఘం, బిఎస్ బి, భూమన్న, విజయ రేఖ, అరుణ రేఖ, దాసు, గౌతమ్ ప్రసాద్, పరుచూరి శ్రీధర్, సల్ల సత్యనారాయణ, శ్యామ్, రమేశ్, పస్క నర్సయ్య, సరిత, ఎల్‌బి రవి, ఆర్ గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్, కార్తీక్, ప్రిన్స్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు విజయం



ట్రోఫీ అందుకుంటున్న జిల్లా జట్టు

నిజామాబాద్‌నాగారం: వరంగల్‌లో ఈ నెల 18 నుంచి 20వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు విజేతగా నిలిచింది. అనంతరం విజేత జట్టుకు సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్ బాబు, రాష్ట్రకార్యదర్శి నవీన్, వరంగల్ సీఐ రవీందర్, రాఘవేందర్ ట్రాఫీని ఆదివారం అందజేశారు. రాష్ట్ర ఉత్తమ బ్యాటర్‌గా కీర్తన(సాంఘిక సంక్షేమ పాఠశాల, సుద్దపల్లి)నిలిచింది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్, ప్రతినిధులు విజేత జట్టుకు అభినందనలు తెలిపారు. జట్టుకు కోచ్, మేనేజర్లుగా నరేశ్, సెంథిల్, బూలబాయి, సౌమ్యరాణి వ్యవహరించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీలు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గెమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన బాలుర, బాలికల జట్లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాము, అశోక్, సురేష్, సుజాత, నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు అభినందన



నిజామాబాద్‌నాగారం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 షటిల్ బాడ్మింటన్ బాలుర విభాగంలో గెలిచిన క్రీడాకారులను క్రీడల కార్యదర్శి నాగమణి ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ పోటీలు ఆఫీసర్‌క్లబ్‌లో నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన మిథున్, ఆదాం, సాత్విక్, మిథున్ కు అభినందనలు తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

కామారెడ్డి జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. పాముకాటుతో ఒకరు, బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో మరొకరు మృతి చెందారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



గంగవ్వ(ఫైల్)

లింగంపేట: పాముకాటుతో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన లింగంపేట మండలంలోని అయిలాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లయల గంగవ్వ(70) సాయంత్రం ఇల్లు ఊడుస్తుండగా పాము కాటువేసింది. కుటుంబీకులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

గాంధారి మండలంలో..



భాస్కర్‌రావు(ఫైల్)

గాంధారి: బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలం నాగ్లూర్ గ్రామానికి చెందిన భాస్కర్‌రావు(42) పద్మాజీవాడి ఎక్స్ రోడ్డు నుంచి బైక్‌పై గాంధారి వైపు వస్తుండగా గాంధారి సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద కోదాడకు చెందిన లారీ వరి ధాన్యం కోసం వెళ్తుండగా ఢీకొన్నది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న భాస్కర్‌రావు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లారీ డ్రైవర్ సైదులును అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ హోంగార్డు..

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో యాసిడ్ తాగిన హోంగార్డు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆరోటౌన్ ఎస్సై వెంకట్రావు ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని సారంగాపూర్‌కు చెందిన చిన్నయ్య(39) జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 16న మద్యం మత్తులో యాసిడి తాగాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కూతురును అరెస్టు చేశామంటూ బెదిరింపులు

కామారెడ్డి క్రైం: మీ కూతురు డ్రగ్స్ కేసులో పట్టుబడిందని, ఆమెను అరెస్టు చేసి తీసుకెళ్తున్నామని ముంబై పోలీసుల పేరిట సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తికి బెదిరింపు కాల్ చేసి డబ్బులు కాజేయాలని యత్నించిన ఘటన జిల్లా కేంద్రంలోని గురురాఘవేంద్ర కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన రవికిరణ్‌కుమార్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి డ్రగ్స్ కేసులో మీ కుమార్తెను అరెస్టు చేసి తీసుకెళ్తున్నామని, రూ. లక్ష తాము పంపించిన నంబర్‌కు పంపకపోతే ఆమె మీకు దక్కదంటు బెదిరించారు. ఫేక్ కాల్ అని గుర్తించిన రవికిరణ్ పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. అతని కుమార్తె క్షేమంగా ఉందని నిర్ధారించుకున్న తర్వాత ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి మాట్లాడారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దని ఎస్‌హెచ్‌వో సూచించారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంతో పాటు విఠల్‌వాడి గ్రామ సమీపంలో పేకాట స్థావరాలపై ఆదివారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్టు చేయగా వీరి నుంచి రూ. 30 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

వేల్పూర్‌లో చైన్ స్నాచింగ్

వేల్పూర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆదివారం గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మోతె గ్రామానికి చెందిన చింతలపల్లి రాజు అనే మహిళ మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు చైన్‌ను లాక్కొని పారిపోయినట్లు ఎస్సై నాగ్‌నాథ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపల్లి రాజు పడగల్ గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లేందుకు వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద బస్సు కోసం వేచి ఉంది. అంతలో బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆమె మెడలో నుంచి బంగారు చైన్‌ను లాక్కొని మెట్‌పల్లి వైపు పారిపోయినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి శుక్రవారం అర్ధరాత్రి ముగ్గురు మహిళలు ఏడాది వయసున్న బాలుడిని కిడ్నాప్ చేసిన ఘటనను పోలీసులు ఛేదించారు. భిక్షాటన కోసమే బాలుడిని కిడ్నాప్ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆదివారం పీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 18న రాత్రి మద్నూర్‌కు చెందిన లక్ష్మి భర్త రాజు పిల్లలతో కలిసి జీజీహెచ్ పరిసరాల్లో నిద్రించారు. రాత్రి 2 గంటల సమయంలో ముగ్గురు మహిళలు బాలుడిని కిడ్నాప్ చేశారు. శనివారం ఉదయం బాలుడు కనిపించకపోవడంతో తండ్రి రాజు ఒకటో టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి రెండు బృందాలతో జీజీహెచ్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. అనంతరం పోలీసులు వివరాలను సేకరించి ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని విచారించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన ముగ్గురు మహిళలు అంజుమ్ బేగంతో ఆమె పదేళ్ల కుమార్తె, దుర్గ ప్రభురావుబా మోహితాలు జీజీహెచ్‌లో తల్లిదండ్రుల మధ్యలో నిద్రిస్తున్న బాలుడిని ఎవరికీ అనుమానం రాకుండా కిడ్నాప్ చేశారు. మొదటగా వీరు రైలు ద్వారా మహారాష్ట్ర వెళ్దామని అనుకున్నా రైలు ఆలస్యంగా వస్తుందని తెలుసుకొని బోధన్ గుండా మహారాష్ట్ర వెళ్దామనుకొని ఆటోలో ఎక్కారు. వీరు బోధన్ రోడ్డులోని ఓ ప్రాంతంలో దిగి నాందేడ్‌కు వెళ్లేందుకు వాహనం కోసం ఎదురు చూస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు పోలీసులకు అందిన సమాచారం మేరకు వారు అక్కడికి చేరుకొని అంజుబేగం, మోహితాలను అదుపులోకి తీసుకుని, బాలుడిని రక్షించారు. వారిని విచారించగా బాలుడిని భిక్షాటన కోసం కిడ్నాప్ చేసినట్లు నేరం అంగీకరించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించి నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. కేసులో తీవ్రంగా కృషి చేసిన ఏఎస్సై షకీల్, కానిస్టేబుళ్లు గంగారాం, అనూష, కెర్బాజీ, రాములును జిల్లా పోలీస్ అధికారులు అభినందించారు.

వాగులో పడ్డ చైన్ మిషన్



రామారెడ్డి: రైతులకు కోతల వేళ గంగమ్మ వాగు వంతెన సగంలో ఆగిపోవడం సమస్యగా మారింది. ఈ వంతెనపై పలు గ్రామాలకు వరి కోత, చైన్ మిషన్లు, జేసీబీలు వెళ్తుంటాయి. ఈ తరుణంలో రాత్రిపూట చైన్ మిషన్ ఓ గ్రామానికి వెళ్తుండగా గంగమ్మ వాగు వంతెన కింద ఉన్న మట్టి కుంగిపోవడంతో వాగులో పడిపోయింది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగలేదు. గత వారం క్రితం ఇదే సర్వీస్ రోడ్డు కింద ధాన్యం తీసుకెళ్తున్న ఓ లారీ బోల్తా కొట్టింది. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆదివారం వేర్వేరు కారణలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. వేధింపులు భరించలేక మహిళ, పెళ్లి కావడం లేదని యువకుడు, వ్యక్తిగత కారణాలతో వాగులో దూకి మరొకరు, రైలుకిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



స్వరూప మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజేశ్

నిజాంసాగర్: తాళికట్టిన భర్త తనువు చాలించగా మరో వ్యక్తితో సహజీవనం చేస్తున్న ఓ మహిళ అతని వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్నూర్ మండలం కొడిచర గ్రామానికి చెందిన కె స్వరూప(34)కు గాంధారి మండలం ముదెల్లి గ్రామానికి చెందిన మొగులయ్యతో 9 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు అరుణ్‌సందేశ్, ఇషాంత్ ఉన్నారు. ఇషాంత్ గర్భంలో ఉన్నప్పుడు మొగులయ్య మృతిచెందాడు. భర్త మృతితో స్వరూప వ్యవసాయ కూలీ పనులు చేస్తూ ఇద్దరు పిల్లలను పోషిస్తోంది. కూలీ పనులకు వెళ్తున్న సమయంలో మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి అరవింద్ అనే ఆటో డ్రైవర్‌తో పరిచయం ఏర్పడి సహజీవనానికి దారితీసింది. అతని మాటలు నమ్మి స్వరూప ఇద్దరు పిల్లలతో కలిసి మహమ్మద్‌నగర్‌కు వచ్చి కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. అరుణ్‌సందేశ్ ఎల్లారెడ్డిలోని గురుకుల పాఠశాలలో ఆరోతరగతి చదువుతుండగా చిన్నకుమారుడు ఇషాంత్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల నుంచి అరవింద్ స్వరూపను బెల్ట్‌తో కొడుతున్నట్లు చిన్నకుమారుడు ఇషాంత్ పోలీసులకు తెలిపారు. అరవింద్ వేధింపులు తాళలేక స్వరూప ఉదయం చిన్న కుమారుడు ఇష్టాంత్‌కు అన్నం తినిపించి బయటకు పంపించింది. కొద్దిసేపటికి స్వరూప అద్దె ఇంట్లోని దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్వరూపకు పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అరవింద్ ఇంటికి వచ్చి చూడగా ఆత్మహత్య చేసుకొని ఉండడంతో స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించినా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చి అరుగుపై పడుకోబెట్టి అరవింద్ పారిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. నిజాంసాగర్ ఎస్సై సుధాకర్, బాన్సువాడ రూరల్ సీఐ రాజేశ్, బాన్సువాడ టౌన్ సీఐ అశోక్‌తో పాటు పిట్లం, బీర్కూర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్ మండలాల ఎస్సైలు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. స్వరూప మృతితో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. తమ కుమార్తె మృతికి బాధ్యుడిపై చర్యలు తీసుకొని ఇద్దరు పిల్లలకు న్యాయం చేయాలని ముదెల్లి, కొడిచెర గ్రామస్తులు డిమాండ్ చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మృతురాలి పిల్లలకు న్యాయం చేస్తామని స్థానికులు ముందుకు రావడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పెళ్లి కుదరడం లేదని యువకుడు..



భిక్కనూరు: పెళ్లి కుదరడం లేదని ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన భిక్కనూరు మండలం జంగంపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సాయి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాసుల సంతోష్ (26) వ్యవసాయం చేసుకుంటు జీవిస్తున్నాడు. కొంత కాలంగా పెళ్లి చేసుకునేందుకు వివాహ ప్రయత్నాలు చేస్తున్నాడు. కాగా అవి సఫలం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై పేర్కొన్నారు.

మారంపల్లిలో..

డొంకేశ్వర్: నందిపేట్ మండలం కుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన మేతరి అశోక్(40) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అశోక్ తిరిగి రాలేదు. ఆదివారం డొంకేశ్వర్ మండల పరిధిలోని మారంపల్లి బ్రిడ్జి వాగు వద్ద స్థానికులకు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మరణించిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని సిర్పాపల్లి–ఉప్పల్‌వాయి ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఆదివారం తెలిపారు. ఉప్పల్‌వాయి రైల్వే గేటు ప్రాంతంలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించినట్లు తెలిపారు. మృతుడి వయస్సు 30–40ఏళ్ల మధ్య ఉంటుందని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712658591, 9493451642 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.